క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించబడునని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యుడు ప్రభాకర్ రావు జ్ఞాపకార్థం నిర్వహించే వైద్య శిబిరాన్ని న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్య పరీక్షలు అనంతరం అవసరమైన వారికి 50 శాతం రాయితీతో కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించబడునని అన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనాన్ని తప్పించబోయి కాలువలో పడిన బస్సు



చెరుకుపల్లి: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన బోది కాలువలో బస్సు పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం తెనాలి నుంచి నగరం వెళుతున్న ఆర్టీసీ బస్సు చెరుకుపల్లి శివారు ప్రాంతం గ్యాస్ గోడౌన్ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి వెళ్లి పడిపోయింది. ఆ సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు ఎనిమిది మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే బస్సులో ఉన్న ప్రయాణికులకు ఏమీ కాకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే దగ్గరలోని క్రేన్ సాయంతో బస్సును బయటకు తీశారు.

నేడు విద్యుత్ నిలిపివేత

చందూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు బుధవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

విద్యార్థులను అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్లటౌన్: ఇంకొల్లు ఆదర్శ శ్రీ సాయిరామ పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు ఎస్పీని కలిసేందుకు మంగళవారం పోలీస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠశాల యాజమాన్యం విద్యార్థులను తీసుకువచ్చారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తులో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యాలను సాధించడం కోసం అనునిత్యం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ తోటకూర విజయభాస్కర్ ఉపాధ్యాయులు అవంతి, శ్రావణి, శ్రీలక్ష్మి అస్మత్ పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగుతో లాభాలు



కొల్లిపర: ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతి రైతు కొంత పంట భూముల్లో నవధాన్యాల సాగు చేయటం వలన లాభాలతో పాటు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని ఐసీఆర్‌పీ ఝాన్సీ రోజా అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఖరీఫ్ యాక్షన్ ప్రణాళిక నవధాన్యాల సాగు విధానంపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం వల్ల కలిగే లాభాలు ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, గోపి, కోటేశ్వరరావు, ఓబులయ్య, సునీల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆర్.వర్ధన్ అనే 11 ఏళ్ల బాలుడిపై ఇటీవల రెండు కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన వర్ధన్‌ను చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చారు. వైద్యాధికారులు గాయాలను శుభ్రం చేసి వైద్య సేవలు అందించారు. చిన్నారిని నాలుగు విడతలుగా వైద్యశాలకు వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. రెండు కుక్కలు ఒక్కసారిగా దాడిచేయడంతో భయాందోళన చెంది ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడని చిన్నారి తల్లిదండ్రులు వాపోయారు.

మండలంలోని మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన హరీష్ అనే చిన్నారి ఇటీవల ఇంటి నుంచి బజారుకు వెళ్తున్న సమయంలో చిన్నారిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన చిన్నారిని వైద్యశాలకు తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు. వీధి కుక్కలను అరికట్టే నాథుడే లేరా అంటూ చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

శునకం.. ప్రాణ సంకటం

- రోడ్లపై గుంపులు.. గుంపులుగా సంచారం
- బాటసారులు, వాహనచోదకులపై దాడులు
- చిన్నారులు, వృద్ధులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులు
- నియంత్రణలో మున్సిపల్, పంచాయతీ అధికారులు విఫలం



పాతబస్టాండ్ సెంటర్‌లో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

బాపట్లటౌన్: బాపట్లలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బాపట్ల పట్టణంలో 34 వార్డులు, మండలంలోని 25 పంచాయతీల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పిల్లలు, మహిళలు, వృద్ధులతో పాటు వాహనదారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. పగటి పూట సైతం చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి.పట్టణంలో నిత్యం జనంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోజురోజుకు వీధి కుక్కల సంతతి పెరిగిపోతుంది. గడిచిన 20 రోజులుగా రోజుకు 10కి పైగా కుక్క కరిచిన కేసులు వైద్యశాలకు వస్తున్నాయంటే కుక్కల స్వైర విహారం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దీంతో ప్రజలు కుక్కలు కనబడితేనే బెంబేలెత్తిపోతున్నారు. శునకాలు ప్రాణ సంకటంగా పరిణమించాయని వాపోతున్నారు.

రేబిస్ లక్షణం

ఈ వ్యాధి సోకితే శరీరంలోని నరాల వ్యవస్థ మొత్తం దెబ్బతిని చివరికి ప్రాణాలు కోల్పోతారు. రేబిస్ సోకిన వారిలో కొందరు నీళ్లు తాగడానికి గానీ, నీటిని చూడటానికి గానీ విపరీతంగా భయపడిపోతారు. ఈ లక్షణాన్ని వైద్య పరిభాషలో హైడ్రోఫోబియా అంటారు. రోగి నీళ్లు తాగకపోవడంతో డీహైడ్రేషన్‌కు గురై మరణం సంభవిస్తుంది.

విచ్చలవిడి వ్యర్థాలే కారణమా..?

పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో చికెన్, మటన్ దుకాణదారులు వాటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా పారేస్తుండటంతో అవి మాంసం, రక్తం రుచిని మరుగుతున్నాయి. వ్యర్థాలు లభించకపోతే మనుషులపై దాడికి పాల్పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ రోడ్ల వెంబడి చెత్త చెదారం నిల్వలు పేరుకుపోవడంతో వాటిల్లో ఆహారం కోసం వచ్చిన సమయంలో అటుగా వెళ్తున్న వారిపై దాడికి పాల్పడుతున్నాయని ప్రజలు అంటున్నారు.

దూరంగా ఉండాలి

కుక్క కరిచినపుడు గాయం తీవ్రతను బట్టి వైద్య చికిత్స ఉంటుంది. కుక్క కాటుకు గురైన వ్యక్తి మూడు లేదా ఐదు ఏఆర్‌వీ డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా కుక్క కరిచిన రోజు, 3, 7 రోజులలో వ్యాక్సిన్ ఇస్తారు. రక్త గాయమైతే అదనంగా 14, 28 రోజులలో కూడా డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు ఇమ్యూనో గ్లోబిన్ ఇంజక్షన్లు వేస్తారు. రేబిస్ వ్యాధి చాలా ప్రాణాంతకం. చికిత్స లేదు. వీధి కుక్కలకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ సిద్దార్థ్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, బాపట్ల

నామమాత్రంగా ఏబీసీ

గతంలో మున్సిపాల్టీ పరిధిలోని సిబ్బంది విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను వెంటాడి కర్రలతో కొట్టి చంపేవారు. ఆ తర్వాత జంతు ప్రేమికులు, పలు స్వచ్ఛంధ సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో వాటిని చంపడం నేరమని తీర్పువచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) ద్వారా శునకాల సంతతి నియంత్రణకు శ్రీకారం చుట్టింది. దీని ద్వారా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేస్తారు. కానీ ఏబీసీ అమలు నామమాత్రంగానే ఉంది.

ఎంపీటీసీ, సర్పంచ్‌లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి

- ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య
- అధికారుల తీరును ప్రశ్నించిన ఎంపీటీసీ బాపనయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

నగరం: అధికారులు ఎంపీటీసీ, సర్పంచ్‌లకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయాలన్నారు. ఎటువంటి పదవులు లేని అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పనిచేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అద్దంకివారిపాలెం ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య అధికారులు తమకు ఎంటువంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవాలంటే టీడీపీ నాయకులు సిఫారస్ చేయాలని అధికారులు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఇష్టానుసారంగా బిల్లులు మార్చుకుంటున్నారని దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాపనయ్య సమావేశంలో తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరవ్వడం పట్ల ఎంపీపీ శ్రీకృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేటపాలెంలో ప్రభుత్వ బడి బాట ప్రచారం



చుండూరు(వేమూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నమోదు సంఖ్య పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల ఉపాధ్యాయులు బట్టు వెంకయ్య అన్నారు. చుండూరు మండలంలోని వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వం బడి బాట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మకు వందనం కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని నాణ్యతతో సరఫరా చేయాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ బడి బాట ప్రచారం బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

27న పుట్టలమ్మ అమ్మవారి తిరునాళ్ల



యాజలి పుట్టలమ్మ అమ్మవారి ఆలయం (ఫైల్)

కర్లపాలెం: భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి చెందిన యాజలి గ్రామ దేవత శ్రీపుట్టలమ్మ అమ్మవారి కొలుపులు బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమవుతాయి. పుట్టలమ్మ అమ్మవారి తిరునాళ్ల (శిడిమాను) మహోత్సవం ఈ నెల 27వ తేదీన ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పుట్టలమ్మ అమ్మవారి తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన శిడిమాను ఉత్సవం తిలకించేందుకు జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ నెల 23 నుంచి 29 వరకు అమ్మవారి కొలుపులు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం అంకురార్పణ, ఊరేగింపుతో కొలుపులు ప్రారంభిస్తారు. 25వ తేదీన అమ్మవారికి మల్లెపూలతో విశేష పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తారు. ఐదో రోజైన 27న జరిగే శిడిమాను ఉత్సవం ప్రధానమైనది ఇదే అమ్మవారి తిరునాళ్ల. అమ్మవారి రథానికి ఉండే దూలానికి ఇనుప బోను ఏర్పాటు చేస్తారు. అనంతరం ఇనుప బోనులో మేకపోతును ఉంచి భక్తుల సందర్శనార్థం గుడిచుట్టూ ప్రదక్షిణ చేయించి అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. ఆరో రోజైన 28న గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు. ఏడో రోజైన 29న మలి కొలుపులు నిర్వహించటంతో కొలుపులు ముగుస్తాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

యాంత్రీకరణ పరికరాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్లటౌన్: రైతులు యాంత్రీకరణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మంగళవారం రైతులకు సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని రైతులు ఎప్పటికప్పుడు యాంత్రీకరణ పరికరాలతో వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మి, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల వ్యవసాయాధికారులు, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణపై చర్యలు తీసుకోవాలి

ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్



మాట్లాడుతున్న ఐక్యవేదిక అధ్యక్షుడు కిరణ్

తెనాలిఅర్బన్: పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో ఎస్సీలను సాంఘిక బహిష్కరణ చేసిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు దాటిన ఇంకా దళితులను అగ్రవర్ణాలవారు చిన్నచూపు చూస్తునే ఉన్నారని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలో ఇంత దారుణం జరిగిన ప్రభుత్వ స్పందించకపోవడం బాధకరమన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని ఖండించాలని కోరారు. అలాగే విద్యుత్‌ఘాతంతో చనిపోయిన కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికీ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులపై ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, ఐక్యవేదిక నాయకులు కనపర్తి సతీష్ కుమార్, తుమ్మల తులసీ, ఉన్నవ రాజేష్, నల్లగండ్ల రవిచంద్ర, పెరికల అరుణ్ పాల్గొన్నారు.

చీటీ పాటల డబ్బులు ఎగ్గొట్టిన నిందితుల అరెస్టు



రేపల్లెరూరల్: చీటీ పాటలు వేసి లబ్ధిదారులకు నగదును ఎగ్గొట్టిన కేసులో ఇరువురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన ఉల్లంగుంట రమణ, ఉల్లంగుంట రత్తయ్యలు గత ఐదు సంవత్సరాల నుంచి చీటీ పాటలు నిర్వహిస్తూ పాటదారులను నమ్మబలికి రూ.కోటి 70 లక్షల వరకు పాటదారులకు చెల్లించకుండా ఎగ్గొట్టారన్నారు. పట్టణానికి చెందిన వీసం మల్లేశ్వరితో పాటు మరికొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెయ్యగా రమణ, రత్తయ్యలు నగదు ఎగ్గొట్టారని తేలిందన్నారు. దీంతో ఇరువురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

సేవానిరతి కలిగి ఉండాలి



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ సేవానిరతిని కలిగి ఉండాలని గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పిలుపునిచ్చారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో మంగళవారం కన్నెగంటి వీరంబశ్రీ హృదయ సాయి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్నెగంటి రమేష్‌బాబు, శిరీష, కన్నెగంటి గోపిచంద్, పార్వతమ్మ, మదాల కోటేశ్వరరావు, విష్ణుంశెట్టి మాధవరావు, వెనిగళ్ళ ప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, మణికుమార్, వెంకటస్వామి, ఉమాదేవి, భానుమూర్తి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దీక్షకు స్పందన



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు మున్సిపల్ అధికారులు స్పందించారు. ఉదయం కార్యాలయం ముందు ప్రత్యేక టెంట్లు వేసి సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు దీక్షాశిబిరాన్ని సందర్శించి కార్మికులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ బాలాజీ మాట్లాడుతూ కార్మికుల ఐక్యతకు నిదర్శనంగా అధికారులు స్పందించారన్నారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంతో పాటు కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగాంజనేయులు, జైభీమ్ భారత్ పార్టీ నాయకులు దోవ రమేష్‌రాంజీ, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు శ్రీనివాసరావు, శివశంకర్, ఎం.దుర్గారావు, కె.వెంకటరమణ, ఏసుబాబు, రాజ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్



స్టువార్టుపురంలో మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్

బాపట్లటౌన్: మొక్కలు నాటడంతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలమని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం మండలంలోని స్టువార్టుపురం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు మొక్కలు విరివిగా నాటాలన్నారు. మనం నాటే మొక్కలు భవిష్యత్ తరాలకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఎక్కడ చెట్లు విరివిగా ఉంటాయో అక్కడి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. మానవ మనుగడకు అవసరమైన ప్రాణవాయువు చెట్ల ద్వారానే అందుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకొని మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, మాజీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, నాయకులు కొండా రెడ్డి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎస్పీ తుషార్‌డూడీ



ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: పర్యావరణ పరిరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. వరల్డ్ ఎర్త్ డేను పురస్కరించుకొని చెరుకుపల్లిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం భావితరాల భవిష్యత్ కోసం.. ప్రకృతి పరిరక్షణ పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, నిర్వాహకులు చేసిన కార్యక్రమాలు తెలుసుకున్న ఎస్పీ మంగళవారం సాయంత్రం ఎస్పీ కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు ఏడుకొండలు రెడ్డి, వందన శర్మ, సుభాష్ చంద్ర బోస్, శివప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పథకం పనులు పరిశీలన



పీఎం శ్రీ పథకం పనులను పరిశీలించిన సమగ్ర శిక్ష అధికారి నాగిరెడ్డి

అమర్తలూరు(వేమూరు): ప్రధానమంత్రి శ్రీ పథకం ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని సమగ్ర శిక్ష అధికారి ఏపీసీ నాగిరెడ్డి తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ పథకం ద్వారా కొన్ని పాఠశాలలు అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అమర్తలూరు మండలంలోని అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణం, ర్యాంపుల నిర్మాణం, ఆట స్థలంలో కోర్టుల పనులు జరుగుతున్నాయన్నారు. పనుల నాణ్యతను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పీఎం శ్రీ పథకం పనుల్లో నాణ్యత లోపిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కనపాల రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఇంజనీరు పవన్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్



ఈఈ చిరంజీవికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నేతలు

తెనాలిటౌన్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించవలసిన పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి.చిరంజీవిని కలిసి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మేన్‌లకు సంవత్సరానికి 8 పెయిడ్ హాలీడేస్ ఉన్నాయని, ఆ పని దినాల్లో అదనంగా పనిచేసిన వారికి వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వేలకోట్ల రూపాయిలు టర్న్ చేసే కంపెనీ చిన్నమొత్తాలను చెల్లించడంలో నిర్లక్ష్యం కనబరచడాన్ని తప్పుబట్టారు. తక్షణం నిధులు విడుదల చేసి కార్మికులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ కార్యదర్శి ఎస్.నాగరాజు, గోపినాథ్, సాంబశివరావు, దాసరి గోపి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల అప్రమత్తతపై అవగాహన

తెనాలి: అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని వెస్ట్‌బెర్రీ పాఠశాలలో ఫైర్ సేఫ్టీ డ్రిల్‌ను నిర్వహించారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రాణాలను రక్షించడానికి చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదం సంభవించినపుడు నివారణ పరికరాలను ఉపయోగించటం, భయాందోళన లేకుండా ఎలా స్పందించాలి అనే అంశాలను ప్రాక్టికల్ డెమో ద్వారా తెలియజేశారు. ప్రమాద సమయంలో ఇవ్వాల్సిన ప్రాథమిక చికిత్స, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయటాన్ని ప్రత్యక్షంగా చూపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.